నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 22 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్

దహెగాంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 21 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్క రూ అధికారులకు సహకరించాలని కోరారు. రూరల్ సీఐ రాం బాబు, ఎస్ఐ ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్

దహెగాం, ఏప్రిల్ 21 : శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ నిర్వహిస్తున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం ఉదయం దహెగాం గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎలాంటి ఇబ్బందులేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, ఎస్ఐ కందూరి రాజు పాల్గొన్నారు.

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర

శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్21 : హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు శిరీష్ శర్మ పూజలు నిర్వహించిన అనంతరం జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు శోభాయాత్రను ప్రారంభించారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి పాల్గొని మొక్కుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, కమిటీ ప్రముఖులు రాధాకృష్ణాచారి, శ్రీనివాస్, మధు, డాక్టర్ రమేశ్, ప్రకాశ్‌గౌడ్, సుధాకర్ ఏర్పాట్లు చేయగా, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు వెంకన్న, నాయకులు విశాల్, కోట వెంకన్న పాల్గొన్నారు.

సీతారాంపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

బీఆర్ఎస్‌నే గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- సీతారాంపల్లిలో ఇంటింటా ప్రచారం

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 21 : పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. ఆదివారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు హామీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ చేయలేదని, వడ్ల కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. కొప్పుల ఈశ్వర్ సామాన్య కుటుంబం నుంచి వచ్చారని, ఢిల్లీలో తెలంగాణ గళం వినిపించాలంటే తప్పకుండా బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గరిసె రామస్వామి, పార్టీ ఉపాధ్యక్షుడు దెబ్బటి రామన్న, కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు ధర్ని శంకర్, పెరుమాళ్ల జనార్దన్, సత్తయ్య, రాయలింగు, సంపత్‌రావు, దేవ మల్లికార్జున్, పోశం, సోమిశెట్టి రామన్న పాల్గొన్నారు.

కారుకు భారీ మెజార్టీ ఇవ్వాలి

వార సంతలో కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

- ఎమ్మెల్సీ దండె విఠల్, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు
- బెజ్జూర్ వారసంతలో ఎన్నికల ప్రచారం

బెజ్జూర్, ఏప్రిల్ 21 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీ ఇవ్వాలని ఎమ్మెల్సీ దండె విఠల్, ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కోరారు. ఆదివారం బెజ్జూర్ మండల కేంద్రంలోని వారసంతలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యాపారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. హోటళ్ల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ సర్కారులో చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆయా వర్గాలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సోయం చిన్నయ్య, సామల రాజన్న, మేర్గు రమేశ్, తేలి రాజేశ్, డబ్బ తిరుపతి, జంగిటి మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

వీకెండ్ నాయకుడా.. ప్రజా సేవకుడా..

ఎవరు కావాల్నో ప్రజలే తేల్చుకోవాలి

- హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలకు కీడు చేస్తున్నది
- రైతులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు పట్టవా?
- రుణమాఫీపై మరోసారి మోసం చేసే కుట్ర
- బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కార్మికుల పక్షాన గళం వినిపిస్తా
- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి విస్తృత ప్రచారం

తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

తిలక్‌స్టేడియంలో క్రికెట్ ఆడుతున్న పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

బెల్లంపల్లి, ఏప్రిల్ 21 : చుట్టపుచూపుగా వచ్చే వీకెండ్ నాయకుడు కావాల్నో.. నిత్యం ప్రజల మధ్య ఉండి సేవ చేసే నేను కావాల్నో ప్రజలే తేల్చుకోవాలని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం బెల్లంపల్లిలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట వన్‌గ్రౌండ్‌కు వెళ్లిన ఆయన తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడారు. క్రికెట్ ఆడి ఉత్సాహం నింపారు. సభ్యులంతా సింగరేణి రిటైర్డ్ కార్మికులు కావడంతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకను గెలిపిస్తేనే కేంద్రం మెడలు వంచి కార్మికుల సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అక్కడి నుంచి నేరుగా కూరగాయల మార్కెట్‌కు వచ్చిన ఆయన వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కాంటా చౌరస్తాలోని పలు హోటళ్లకు వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏఎంసీ ఏరియాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారన్నారు. హామీలను నమ్మి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజలకు కీడు చేస్తుందని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని గుర్తు చేశారు. ప్రస్తుతం విద్యుత్, తాగు, సాగు నీరు అందక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యారంగం అస్తవ్యస్థంగా మారిందని, వైద్య రంగాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, రైతు పథకాలను అమలు చేయకపోవడంతో ఆత్మహత్యలు పెరిగిపోయి వ్యవసాయ రంగం కుదేలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకు వచ్చి 48 మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్యకు కారణమైందని, 50 లక్షల మంది ఆటో డ్రైవర్లను రోడ్డున పడేసిందని చెప్పుకొచ్చారు. రైతు బంధు నిధులు రూ. 7500 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా వారికి ధైర్యం చెప్పాల్సిందిపోయి తేలికగా తీసుకుంటోందని విమర్శించారు. గృహ జ్యోతి పథకం ద్వారా మొదటి నెల మాత్రమే జీరో బిల్లు ఇచ్చి, మరుసటి నెల నుంచి బిల్లులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు ఇవ్వనందుకు, ఎండిపోయిన పంటలకు నీరివ్వనందుకు, గొర్రెలు, చేపల పంపిణీ పథకాలు నిలిపివేసినందుకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలా అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఇవ్వకపోగా టెట్ దరఖాస్తుకు రూ. వెయ్యి చొప్పున వసూలు చేసి యువతపై భారం మోపిందన్నారు. గతంలోనే రుణ మాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆగస్టు 15న రుణమాఫీ చేస్తామని ప్రకటించి మరోసారి మోసం చేసే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. ఇంటిస్థలాల రెగ్యులరైజేషన్, డిపెండెంట్ ఉద్యోగాలు, ఏసీ సౌకర్యం, ఇంటికి రుణాలు ఇప్పించామని గుర్తు చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌ను కాకా కుటుంబం మాత్రమే అనుభవిస్తోందని, ప్రస్తుతం ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా, మళ్లీ ఎంపీ టికెట్‌ను కూడా వారి కుమారుడికే కేటాయించారని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ఉన్న రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇతర ఎస్సీలు లేరా అని ప్రశ్నించారు. ఆరుగురు ఎమ్మెల్యేలు, చివరికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కూడా అడ్డుకున్నా గడ్డం వంశీ ఎంపీ టికెట్ తెచ్చుకున్నారని తెలిపారు. వేలాది కోట్లు ఖర్చు పెట్టి గల్లీ నుంచి ఢిల్లీ దాకా నాయకులను కొని ఎన్నికల్లో ఎంపీ టికెట్ సంపాదించుకున్నారని పేర్కొన్నారు. 76 ఏండ్ల నుంచి ఇక్కడ కాకా కుటుంబం మాత్రమే పాలన చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రాంతం ఏమైనా వారి జాగీరా అని ప్రశ్నించారు. ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ మాత్రం రెండు మాదిగ, ఒకటి మాల సామాజిక వర్గానికి కేటాయించారని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుడిగా సమస్యలపై తనకు అవగాహన ఉందని, తనను గెలిపిస్తే కార్మికుల పక్షాన పార్లమెంట్‌లో తన గళం వినిపిస్తానని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టి ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికలతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు.

బడా వ్యాపారీకి... సామాన్య కార్మికుడికి పోటీ : మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

రాబోయే పార్లమెంట్ ఎన్నికలు బడా వ్యాపారీకి, సామాన్య కార్మికుడి నడుమ జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండి సేవ చేసే కొప్పుల ఈశ్వర్‌ను ప్రజలు ఆదరించాలన్నారు. నెల రోజుల ముందు గడ్డం వంశీ అంటే ఎవరో కూడా తెలియదని, ప్రజలతో ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడని, ప్రజలు ఆయనను నమ్మే స్థితిలో లేరని తెలిపారు. కేసీఆర్‌ది కుటుంబపాలన అని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డికి కాకా కుటుంబం ఎందుకు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ పాతబస్తీ నుంచి వలస వచ్చి 60 ఏండ్లుగా ఈ ప్రాంతాన్ని పాలిస్తున్నారని కాకా కుటుంబంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లు దండుకుంటూ లక్షల కోట్లు సంపాదించిన కాకా కుటుంబం పలు రాష్ట్రాల్లో కంపెనీలు ఏర్పాటు చేసిందని, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో మాత్రం ఒక్క కంపెనీ కూడా ఏర్పాటు చేయలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త రాములు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ వాజిద్ పాషా, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, టీబీజీకేఎస్ నాయకులు దాసరి శ్రీనివాస్, ఆవుల రవికిరణ్, రాజనాల రమేశ్, లింగాల కిరణ్, అనుముల సత్యనారాయణ, నాయకులు రెవెల్లి విజయ్, సాజిద్ పాషా పాల్గొన్నారు.

'రైతుబంధు'కు మొండిచేయేనా..!

- యాసంగి పంటలు చేతికొస్తున్నా అందని పెట్టుబడి సాయం
- ఇప్పటి వరకు మూడెకరాలకు మించి ఇవ్వని సర్కారు
- శాటిలైట్ సర్వే పేరిట కొత్త నిబంధనలు తెచ్చే యోచన
- ఐదెకరాల పైనున్న వారు ఆశలు వదులుకోవాల్సిందేనా..!

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/పెంచికల్‌పేట్, ఏప్రిల్ 21 : రైతుబంధు రాకపోవడంపై జిల్లా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ఐదెకరాల లోపు ఉన్న రైతులందరికీ పెట్టుబడి సాయమందిందని కాంగ్రెస్ చెబుతున్నా, అసలు నాలుగెకరాలున్నవారికే ఇప్పటి దాకా దిక్కు లేదని రైతులు మండిపడుతున్నారు. ఈ పథకం అమలుపై కొత్త నిబంధనలు తీసుకొస్తున్నట్లు తెలుస్తుండగా, ఇక రైతుబంధుకు రాం.. రాం.. తప్పదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శాటిలైట్ ద్వారా సర్వే చేసి ఎన్ని ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయనేది స్పష్టంగా తెలుసుకొని.. ఆపై రైతుబంధు ఇవ్వాలనే ఆలోచనలో సర్కారు ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే, ఈ పథకంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతాంగం ఆశలు వదులుకొనే పరిస్థితి దాపురిస్తున్నది.

యాసంగి పంటలు చేతికొస్తున్నా..

ఐదెకరాల్లోపు రైతుబంధు అందించామని చెబుతున్న కాంగ్రెస్ సర్కారు.. ఆ పైన భూములున్న వారికి మాత్రం మొండిచేయి చూపుతున్నది. యాసంగి పంటలు వేసే సమయంలో పెట్టుబడి సాయం అందించాల్సి ఉండగా, ప్రస్తుతం పంటలు చేతికి వస్తున్నా.. పైసా దిక్కు లేదని రైతులు మండిపడుతున్నారు. గతేడాది యాసంగిలో కేసీఆర్ సర్కారు జిల్లాలోని 1,31,518 మంది రైతులకు దాదాపు రూ. 128 కోట్లు ప్రభుత్వం అందించింది. కానీ, ఈ యాసంగిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ రైతుబంధు అందించలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిబంధనల పేరిట సర్వేలు చేయిస్తే అనేక సమస్యలు తెరపైకి వస్తాయని, రైతుబంధు పథకంపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుబంధు డబ్బులు రాలే

నాకు నాలుగెకరాల భూమి ఉంది. గతేడాది కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎకరానికి రూ.5 వేల చొప్పున రూ. 20 వేలు నా బ్యాంకు ఖాతాలో పడ్డయి. కానీ ఈ యాసంగిలో కాంగ్రెస్ సర్కారు ఇప్పటికీ పెట్టుబడి సాయం అందించలేదు. అప్పులు చేసి పంటలేసిన. రైతుబంధు వస్తదనే నమ్మకం లేకుంటైంది. ముస్ముందు ఎలాంటి సాకులు చెప్పి రైతుబంధు ఆపేస్తరోనని అనుమానంగా ఉంది.

- శంకర్, రైతులు, పెంచికల్‌పేట్

రైతుబంధు ఉంటదో... పోతదో..

రైతుబంధు అమలుపై మాకు నమ్మకం పోతుంది. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి తప్పుచేశామని పిస్తోంది. రైతుబంధు అమలుపై ఇన్ని రకాల ఇబ్బందులు పెడుతదనుకోలే. కేసీఆర్ సర్కారులో సమయానికి డబ్బులు అందినయి. ఇప్పుడు కొత్త సర్వేలు చేపట్టి రైతుబంధు అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతుంటే అసలు రైతుబంధు పథకం ఉంటదో.. పోతదో అన్న అనుమానం కలుగుతుంది.

-పోషన్న, రైతు, పెంచికల్‌పేట్

సాయం అందించిన తర్వాతే సర్వే చేయాలి

కెరమెరి, ఏప్రిల్ 21 : శాటిలైట్ సర్వేకు సమయం పడుతోంది. అప్పటి వరకు సాగు చేస్తున్న భూములకు పెట్టుబడి సాయం అందించాలి. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. జూన్ 4న ఫలితాలు వస్తాయి. అప్పటి వరకు వానకాలం సీజన్ వస్తుంది. ఇగ ఆ సమయంలో సర్వేలు చేపడితే రైతుబంధు ఎప్పుడిస్తరు. అవసరమనుకుంటే పెట్టుబడి సాయం అందించిన తర్వాతే సర్వేలు నిర్వహించాలి. అంతేగాని సర్వేల పేరిట కాలయాపన చేసి రైతులకు నష్టం చేయవద్దు.

- కేంద్రేబాలాజీ, రైతు, ధనోర, కెరమెరి

రేషన్‌దందా..ఖాకీల అండ..!

- బియ్యం అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు
- 'మామూళ్లు ఇస్తున్నాం కదా'.. అని స్మగ్లర్లు వ్యాఖ్యానించడంపై పలు అనుమానాలు
- ఆరోపణలు నిజం కాదు : ఎస్ఐ జగదీశ్‌గౌడ్

తాండూరు పోలీస్ స్టేషన్‌లో పోలీసులను నిలదీస్తున్న పీడీఎస్ బియ్యం వ్యాపారులు

తాండూర్, ఏప్రిల్ 21 : తాండూర్ పోలీసులు రేషన్ బియ్యం దందాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, శనివారం జరిగిన ఘటనే ఇందుకు బలం చేకూరుస్తున్నది. రేషన్ దందా చేస్తున్న ఓ ముఠా ఏకంగా పోలీస్‌స్టేషన్‌లోనే ఓ వ్యక్తిపై దాడికి యత్నించడం.. ఆపై పోలీసులపై దౌర్జన్యానికి దిగడం చర్చనీయాంశమైంది. 'మామూళ్లు ఇస్తున్నాం కదా.. మరి బియ్యం ఎలా పట్టుకున్నారు' అంటూ వారు ఖాకీలపై ఆగ్రహం వ్యక్తం చేయగా, పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలిలా.. తాండూరు పోలీసులు శనివారం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆటో డ్రైవర్ కొల్లూరి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకోగా, రేషన్ మాఫియా రంగంలోకి దిగింది. తాండూరుకు చెందిన ఎర్ర శ్రీనివాసే.. పోలీసులకు సమాచారం ఇచ్చాడని భావించి ఫజాన బేగం, అమీనా బేగం, టీన బేగం అతడిపైకి గొడవకు వెళ్లారు. దీంతో భయపడ్డ ఎర్ర శ్రీనివాస్ తప్పించుకొని పోలీస్‌స్టేషన్ వెళ్లాడు. అక్కడికి చేరుకున్న ఆ ముగ్గురు మహిళలు అతడిని తమకు అప్పగించాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగి ఒత్తిడి తెచ్చారు. దీంతో బిత్తరపోవడం పోలీసుల వంతైంది. పోలీస్‌స్టేషన్‌లోకి దూసుకొచ్చి నానా బూతులు తిట్టి, విధులకు ఆటంకం కలిగించినందుకు ఆ మహిళలపై కేసు నమోదైంది.

నెల నెలా మామూళ్లు ఇస్తున్నం...

'నెల నెలా మామూళ్లు ఇస్తున్నాం కదా. రంజాన్ కావడంతో ఈ నెల ఇవ్వలేదు. ఎస్ఐ సార్‌ను కలవలేదు. అందుకే మా ఆటోలు పట్టుకున్నరు. సమాచారం ఇచ్చిన వ్యక్తి గోడదూకి పారిపోతుంటే ఏం చేస్తున్నరు. ఎట్టి పరిస్థితుల్లో ఆ వ్యక్తిని అప్పగించాల్సిందే' అంటూ ఫజాన బేగం, అమీనా బేగం, టీన బేగం పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. రేషన్ దందాలో పోలీసుల పాత్ర ఉన్నట్లు తెలుస్తున్నది. ఇక పోలీసులకు సమాచారం ఇచ్చిన వ్యక్తి సైతం రేషన్ దందా సాగిస్తాడని సమాచారం. మరి ఆ వ్యక్తిని పోలీసులు ఎందుకు వదిలేశారని పలువురు ప్రశ్నించడం కొసమెరుపు.

పోలీసులపై ఆరోపణలు నిజం కాదు

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యాపారుల ఆరోపణలు నిజం కాదు. కొద్ది రోజులుగా వరుసగా బియ్యం పట్టుకుంటున్నాం. దీంతో వాళ్లు అనవసరపు ఆరోపణలు చేస్తున్నారు. అక్రమ రవాణా చేసే వారిని వదిలేది లేదు. పోలీస్‌స్టేషన్‌లో ఆందోళ చేసిన వారిపై కేసులు నమోదు చేశాం.

-జగదీశ్‌గౌడ్, తాండూర్ ఎస్ఐ

ఎండిన 'హరిత' మొక్కలు

కేసీఆర్ సర్కారు హరితహారంలో భాగంగా పలుచోట్ల నాటిన మొక్కలు ఎండిపోయాయి. మంచిర్యాల పట్టణంలోని గ్రీన్‌సిటీతో పాటు పండ్ల వనంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటగా, ఏపుగా పెరిగి కళకళలాడాయి. ఆపై అధికారులు పట్టించుకోకపోవడంతో పూర్తిగా ఎండిపోయి లక్షలాది రూపాయలు వృథా అయ్యాయి.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఎండిన మంచిర్యాల గ్రీన్‌సిటీలో నాటిన మొక్కలు